

మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11 : బీదర్ నుంచి మహేశ్వరం వరకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ నిర్మిస్తున్న 765కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లో భూములు కోల్పోతున్న రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి బుధవారం చీఫ్ సెక్రటరీ శాంతకుమారికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 165కి.మీ మేర నిర్మిస్తున్న పవర్‌లైన్‌లో 3వేల ఎకరాల భూమిని కోల్పోతున్నట్లు తెలిపారు. మార్కెట్ విలువ ఎకరానికి రూ. 3 కోట్లు ఉందన్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

▸ కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్ 11 : ఇంటింటి సర్వేకు తోడ్పాటును అందిస్తూ ఓటరు జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ శశాంక సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 18 వరకు ప్రీ రివిజన్ యాక్టివిటీస్ నిర్వహిస్తామని, అందులో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి అక్టోబరు 29 న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేస్తామని తెలిపారు. దానికి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలని అన్నారు. ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ సభ్యుల పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారణ



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

చేసుకుంటారని చెప్పారు. జనవరి 6న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నాగార్జున, పార్టీల నాయకులు హరికృష్ణ, నెట్టు ధనుంజయ, జగదీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అవకతవకలు జరగకుండా చూడాలి

మహేశ్వరం: అంగన్‌వాడీ సెంటర్లలో అవకతవకలు జరగకుండా చూడాలని, ఆ బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనని కలెక్టర్ శశాంక అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణులకు అందాల్సిన భోజనం, పాలు, గుడ్లు సరైన పద్ధతిలో అందిస్తున్నారా.. లేదా చూడాలని, వాటి సరఫరాలో ఏమాత్రం అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని పలు అంగన్‌వాడీ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్లో పిల్లలు ఎంతమంది ఉన్నారు. వారికి ప్రతి రోజు ఏమేం ఆహారం అందిస్తున్నారని అంగన్‌వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు విద్యాబోధనతో పాటు ఆటలు, పాటలూ నేర్పించాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు ఇచ్చే కోడిగుడ్లు నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ వెంకట్రాం, సీడీపీవో శాంతిశ్రీ ఉన్నారు.



హిమాయత్‌సాగర్ బఫర్‌జోన్ పరిధిలో ఉన్న ఫాంహౌస్

శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల పరిధిలోని జంట జలయాశయాలైన గండిపేట చెరువు, హిమాయత్ సాగర్ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఇష్టారాజ్యంగా ఫామ్‌హౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాలు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతం నగరానికి కూతవేటు దూరంలో ఉండడంతో శ్రీమంతులు, రాజకీయ నాయకులు, ఇతర రంగాల ప్రముఖులు పదుల సంఖ్యలో ఫామ్‌హౌస్‌లను నిర్మించుకున్నారు. అయితే ఈ నిర్మాణాల్లో చాలావరకు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రచారం సాగుతోంది. కాగా, ఆయా వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులు ఇప్పటికే 'హైడ్రా'కు అందించినట్లు సమాచారం. దీంతో హైడ్రా అధికారులు ఆ అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

- నగరానికి సమీపంలో ఉండటంతో భారీగా నిర్మాణాలు
- గండిపేట పరిధిలో పలు నిర్మాణాలను కూల్చిన హైడ్రా
- మిగిలిన భవనాల యజమానుల్లో మొదలైన గుబులు
- పెద్దమంగళారం, తోల్‌కట్ట చెరువుల్లో భారీగా ఆక్రమణలు
- మాయమైన శంకర్‌పల్లి మండలంలోని మొండి వాగు

జంట జలాశయాల్లో ఫామ్‌హౌస్‌లు!

ఆక్రమణలకు గురైన గండిపేట చెరువు, హిమాయత్ సాగర్

కబ్జాల పర్వం 12

చేవెళ్ల, సెప్టెంబరు 11: మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామం రెవెన్యూ పరిధిలోని పలువురు వీఐపీలకు చెందిన ఫామ్‌హౌస్‌లను ఇప్పటికే హైడ్రా కూల్చివేసిన సంగతి తెలిసిందే. గండిపేట్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కూల్చాల్సిన వ్యవసాయ క్షేత్రాలు, ఫామ్‌హౌస్‌లు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర మాజీ మంత్రికి చెందిన వ్యవసాయ క్షేత్రాలు చిలుకూరు గ్రామం పరిధిలో ఉన్నాయి. అలాగే ఓ పారిశ్రామికవేత్తకు చెందిన ఫామ్‌హౌస్ గండిపేట్ జలాశయం బఫర్ జోన్‌లో నిర్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఓ కీలక నాయకుడికి సంబంధించిన ఫామ్‌హౌస్ సైతం అక్కడ ఉండటం గమనార్హం. దీంతో పాటు ఓ పాపులర్ విద్యాసంస్థల యజమానికి చెందిన ఫామ్‌హౌస్ అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలకు సంబంధించిన వారంతా హిమాయత్ సాగర్ పరిధిలోకి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిని ఆక్రమించినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా ఇప్పటికే హైడ్రా అధికారులకు నివేదిక ఇచ్చిన్నట్లు సమాచారం. దీంతో ఆక్రమణదారుల్లో హైడ్రా గుబులు పట్టుకుంది. అధికారులు ఎప్పుడు వచ్చి కూల్చివేస్తారో అనే భయం వారిని వెంటాడుతోంది.

ఇనుప కంచె తొలగింపు

షాబాద్ మండల కేంద్రంలో పైల్వాన్ చెరువు, మండల పరిధిలోని చందన్‌వెల్లి చెరువు, సోలిపేట్, తాళ్లపల్లి, మాచన్‌పల్లి, పెద్దవేడు తదితర గ్రామాల్లో పెద్ద చెరువులు ఉన్నాయి. ఆ చెరువులు కబ్జాకు గురికాలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే పహిల్వాన్ చెరువు బఫర్‌జోన్ సమీపంలో నిబంధనల ప్రకారం భూమి కొనుగోలు చేసినప్పటికీ పొలం చుట్టు ఓ రాజకీయ నాయకుడి సోదరి ఇనుప కంచె ఏర్పాటు చేయించింది. అయితే అది బఫర్‌జోన్‌లో ఉండటంతో వెంటనే తొలగించాలని అధికారులు నోటీసులు అందజేశారు. దీంతో ఆమె స్వయంగా కూలీలతో తీసివేయించారు.



మీర్జాగూడ గ్రామంలో ఫంక్షన్‌హాల్ యజమాని మట్టి పోయడంతో కనుమరుగైన మొండివాగు

మొయినాబాద్ మండలంలో..

మొయినాబాద్ మండలంలో మొత్తం 50 చెరువులు ఉన్నాయి. ఇందులో 20 చెరువుల వరకు ఆక్రమణకు గురైయ్యాయి. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల ప్రహరీ, రోడ్లు, ప్రీకాస్ట్ వాల్స్ ఒకటి రెండు చెరువుల్లో నిర్మాణాలు కూడా దర్శనమిస్తున్నాయి. అలాగే మండల పరిధిలోని పెద్దమంగళారం, తోల్‌కట్ట గ్రామ చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ అక్రమ నిర్మాణాలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



మొండివాగులో పోసిన మట్టి

మొండివాగు మూసివేత

శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ గ్రామంలోని పెద్ద చెరువులోకి నీళ్లు రాకుండా మిర్జాగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఫంక్షన్ హాల్ యజమాని మొండివాగులో వందలాది లారీల మట్టిపోసి వాగును మూసివేశాడు. ఈ వాగు పూర్తిగా కనుమరుగు కావడంతో పెద్ద చెరువులోకి నీళ్లు రావడం లేదు. అదేవిధంగా పెద్ద చెరువు - మొండివాగు మధ్య హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి సైతం ఈ వాగు నుంచి వచ్చే వర్షపు నీటి కోసం ఉన్న వాగును ఒకవైపు మూసివేశాడు. దీంతో పెద్ద చెరువులోకి వరద నీళ్లు రాకుండా ఆటంకం ఏర్పడింది. దీంతో ఆ చెరువులు పూర్తిగా నిండటం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జన్వాడ తుమ్మ సముద్రం చెరువులో ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన ఓ వ్యక్తి తన ఫామ్‌హౌస్‌లోకి వెళ్లేందుకు దర్జాగా అడ్డంగా రోడ్డును నిర్మించి గేట్‌ను ఏర్పాటు చేసుకున్నాడు.




పహిల్వాన్ చెరువు పరిధిలో కంచెను తొలగిస్తున్న కూలీలు

హైడ్రా డేగ కన్ను

- చెరువులు, కుంటలు, సర్కార్ స్థలాల పరిశీలన
- గుట్టుచప్పుడు కాకుండా పర్యటిస్తున్న బృందాలు
- సిబ్బంది పెంపుతో మరింత దూకుడు
- మూసీ, జంట జలాశయాలపై ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా దూకుడు పెంచుతోంది. నగర శివార్లలోని చెరువులు, కుంటలు, నాలాలతో పాటు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను పరిశీలించేందుకు హైడ్రా బృందాలు ఫిర్యాదులు ఆధారంగా స్థల పరిశీలనలు చేస్తున్నాయి. ఇంతేకాక సుదీర్ఘకాలంగా కబ్జాలకు గురవుతున్న చెరువులు, కుంటలు, ఇతర జలాశయాలను పరిశీలించేందుకు గుట్టుచప్పుడు కాకుండా పర్యటిస్తున్నాయి. హైడ్రాను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అదనపు సిబ్బందిని కూడా నియమిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా 15 మంది సీఐలు, 8 మంది ఎస్ఐ స్థాయి అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ సంఖ్యను మరింత పెంచనున్నట్లు సమాచారం. అలాగే హైడ్రా కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలపై వెనక్కి తగ్గేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. కోర్టులకు వెళ్లినా కొట్లాడి మరీ అక్రమనిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. ఇక మధ్య, పేద తరగతి వర్గాల వారికి నష్టం జరకుండా చూస్తామని హైడ్రా అధికారులు చెబుతున్నారు. నివాసం ఉండే ఇళ్ల జోలికి ఇప్పట్లో వెళ్లమని కూడా ప్రకటించారు. తెలిసో తెలియకో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఇళ్లు కొనుగోలు చేసిన వారికి ఇది కొంత ఊరట కలిగించే విషయం. దొడ్డిదారిన కొందరు బిల్డర్లు హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అనుమతులు తీసుకుని నివాస సముదాయాలు నిర్మించి అమ్మేశారు. తొలుత హైడ్రా ఈ నిర్మాణాలను కూడా కూల్చివేసింది. దీంతో బాధితులతో పాటు కొన్నివర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో హైడ్రా వివరణ ఇచ్చింది.



ఇప్పటికే 112 ఎకరాలు స్వాధీనం

ఇదిలా ఉంటే ఇప్పటికే గ్రేటర్ పరిధిలో 23 ప్రాంతాల్లో 262 ఎకరాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి దాదాపు 112 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా ప్రకటించింది. ఇందులో సింహభాగం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. మాదాపూర్ సున్నం చెరువులో 42, గగన్ పహాడ్ అప్పాచెరువులో 14, దుండిగల్ కత్వా చెరువు పరిధిలోని 13 అక్రమ నిర్మాణాలను తొలగించారు. సున్నం చెరువులో ఆక్రమణలు తొలగించి 10 ఎకరాలు, గండిపేటలో 8.75 ఎకరాలు, చిలుకూరులో 6.5 ఎకరాలు, కత్వా చెరువులో 2.5 ఎకరాలు, తుమ్మిడి కుంటలో 4.9 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వెల్లడించింది.

హిమాయత్‌సాగర్, మూసీపై దృష్టి

ప్రస్తుతం నగర శివార్లలోని జంట జలాశయాలైన గండిపేట(ఉస్మాన్‌సాగర్) హిమాయత్‌సాగర్ చెరువులతో పాటు మూసీ పరీవాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై ఎక్కువ దృష్టి పెడుతోంది. ఇప్పటికే గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా అధికారులు ప్రస్తుతం హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంతో పాటు మూసీపై దృష్టి సారించారు. హిమాయత్‌సాగర్, మూసీ పరివాహక ప్రాంతంలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్నారు. సంబంధిత అధికారులతో కలిసి రహస్యంగా సర్వేలు చేయించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోజోన్ పరిధి గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలో హైడ్రా అధికారులు ఇప్పటికే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. మరో వైపు హైడ్రా కూల్చివేతలతో అప్రమత్తమైన కొంత మంది ముందుగానే స్వయంగా ఆక్రమణలు తొలగించుకుంటున్నారు. ఇందులో కొందరు ప్రముఖులు కూడా ఉండడం గమనార్హం. బఫర్‌జోన్ పరిధిలోని ప్రహరీ, షెడ్లు తొలగించి ఫెన్సింగ్ వేసుకుంటున్నారు. తొలగించిన శిథిలాలుకూడా అక్కడ లేకుండా జాగ్రత్త పడుతున్నారు. త్వరలో హిమాయత్‌సాగర్, మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు భారీ ఆపరేషన్ ఉండవచ్చని తెలుస్తోంది.

ఎరువులు, విత్తనాలపై జీఎస్టీ ఎత్తేయాలి

- త్వరలో ధరణి పోర్టల్ రద్దు
- భూమాత పోర్టల్‌తో తీరనున్నరైతుల కష్టాలు
- రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండరెడ్డి

యాచారం, సెప్టెంబరు 11 : కేంఎరువులు, విత్తనాలపై జీఎస్టీని ఎత్తివేయాలని రైతు సంక్షేమ కమిషన్ రాష్ట్ర చైర్మన్ ఎం.కోదండరెడ్డి డిమాండ్ చేశారు. రైతులను నానా ఇబ్బందులు పెడుతున్న ధరణి పోర్టల్‌ను త్వరలో రద్దు చేసి భూమాత పోర్టల్ ద్వారా రైతుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ధరణి పోర్టల్ కారణంగా రాష్ట్రంలో వేలాది మంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు నోచుకోలేకపోతున్నారని అన్నారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా యాచారం, గున్‌గల్, నందివనపర్తి, తక్కళ్లపల్లి, మొండిగౌరెల్లి, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి, మంతన్‌గౌరెల్లి. చింతపట్ల గ్రామాల్లో ప్రముఖ న్యాయవాది సునీల్ తన బృందంతో పర్యటించి రైతుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. వాటన్నింటినీ క్రోడీకరించి ఓ పుస్తకంగా తీర్చిదిద్ది బుధవారం యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు ఆయా గ్రామాల రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి కోదండరెడ్డి అందించారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. తాను ఇదే అంశంపై కేంద్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. భూమాత పోర్టల్ రాగానే మండలంలో ఏ ఒక్క గ్రామంలో రైతుల భూ తగాదాలు లేకుండా చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. ధరణి పోర్టల్ తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. ధరణి పోర్టల్ బడా రైతులకు మాత్రమే ఉపయోగపడింది తప్ప.. పేద, మధ్యతరగతి రైతులకు గత 8 ఏళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోలేకపోవడం దారుణమన్నారు. కాగా, ఆయా గ్రామాల్లో పట్టా భూములపై 3039, ఇనాం భూములపై 346, లావణి భూములపై 814, సీలింగ్ భూములపై 105, ప్రభుత్వ భూములపై 75, భూదాన్ భూములపై 86 ఫిర్యాదులు అందాయని ప్రముఖ న్యాయవాది సునీల్ తెలిపారు. రైతులు ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కరిస్తారనే నమ్మకం ఉందన్నారు. వీటితో పాటు పట్టాదారు పాసుబుక్‌ల కోసం 558 మంది, భూముల విభజనపై 4,465 ఫిర్యాదులు అందాయని ఆయన చెప్పారు. మండలంలో వందకు వంద శాతం భూతగాదాలు లేకుండా చేసి రాష్ట్రంలో ఆదర్శ మండలముగా మార్చడం కోసం తన బృందం చొరవ తీసుకుంటుందని సునీల్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

ఫార్మాసిటీని రద్దు చేయాలి

- నాడు రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు తెరపైకి తేవడం దారుణం
- నమ్ముకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచింది
- ఎనిమిదేళ్లుగా నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించలేదు
- మేడిపల్లిలో నల్ల బ్యాడ్జీలు ధరించి రైతుల ఆందోళన
- సీఎంకు పోస్టుకార్డులు రాసిన రైతులు

యాచారం, సెప్టెంబరు 11 : ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని, తాము అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామని మళ్లీ ఇప్పుడు దానిని తేవడం దారుణమని యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని మాట ఇచ్చి తీరా అధికారంలోకి రాగానే ఫార్మాసిటీలో పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం పూనుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. తక్షణమే ఫార్మాసిటీని రద్దు చేసి ఇక్కడి రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మేడిపల్లిలో రైతులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము నమ్ముకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమని నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాసిటీలో ఎలాంటి పరిశ్రమలూ ఏర్పాటు చేయకుండా తమకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్లుగా నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములను ఆ జాబితా నుంచి తొలగించి రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ తెస్తే తాము కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి గెలిపిస్తే నేడు తమకు తీవ్ర అన్యాయం చేయడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే తమ ఆందోళన మరింత తీవ్రతరం చేయడం ఖాయమని ఆందోళనకారులు తేల్చి చెప్పారు. కొందరు అధికారులు రైతులకు ఫోన్‌లు చేసి భూమి ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. రైతులను ఆదుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నెరవేర్చలేక పోతుందని రైతులు ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాలలో ఫార్మాసిటీ బాధిత రైతులను ఆదుకునేందుకు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తప్పదని రైతులు చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా కల్పించుకొని తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. కాగా ఫార్మాసిటీ రద్దు చేయాలని పలువురు రైతులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డులు పంపారు.



ఫార్మాసిటీని రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న రైతులు

672 మంది పిల్లల్లో పౌష్టికాహార లోపం

● రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11 : జిల్లాలో పౌష్టికాహార లోపంతో 672 మంది పిల్లలు బాధ పడుతున్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బీ.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెలలో జరిగే పోషణ మాసోత్సవ కార్యక్రమం గురించి జిల్లాలోని వైద్యాధికారులకు, సిబ్బందికి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 672 మంది చిన్నారులు తీవ్రమైన పోషకాహరలోపం వల్ల, 3,128 మంది మాధ్యమిక పోషకాహార లోపం వల్ల ఐదు సంవత్సరాలలోపు పిల్లలు బాధపడుతున్నట్లు తెలిపారు. ఇందులో తీవ్రమైన పౌషకారలోపం పిల్లలకి వైద్యాధికారులు చికిత్స అందిస్తూ వారు మామూలు స్థితికి వచ్చేలా చేయాలని సూచించారు. అదేవిధంగా మాధ్యమిక పోషకాహార లోపం పిల్లలకి బాలామృతం ప్లస్ ద్వారా అందించే పోషక విలువలున్న పదార్థాలను తీసుకునేటట్లుగా పిల్లల తల్లిదండ్రులకి నచ్చచెప్పాలని సూచించారు. దీని ద్వారా పిల్లల్లో రక్తహీనత నివారించబడుతుందని తెలిపారు. ప్రతీ అంగన్వాడీ కేంద్రంలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ గ్రోత్ మానిటరింగ్ చేసే విధంగా సహకరించాలని తెలిపారు. తల్లులకు కచ్చితంగా తల్లి పాల గురించి తెలపాలని, అదనపు ఆహారం యొక్క విలువను తెలపాలని, అన్ని సీజన్లలో దొరికే పండ్లను పిల్లలకు తినిపించేలా సూచించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే కంటిన్యూ చేయాలని, జ్వరం ఉన్నవారిని గుర్తించినప్పుడు సకాలంలో చికిత్స చేసి ఆ చుట్టూ ఉన్న ఇండ్లలో ఇంకెవ్వరికీ రాకుండా రక్త పరీక్షలు చేయాలని, క్యాంపులు పెట్టి చికిత్సలు అందించాలని సూచించారు. ఎక్కడ కూడా డెంగీ జ్వరాలు, ఇతర వ్యాధులతో మరణాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గణేష్ నిమజ్జనం స్థలాలలో హెల్త్ క్యాంపులు పెట్టాలని, 108 వాహనాలను సిద్ధంగా ఉండేటట్లు చూడాలని ఆయన తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డాక్టర్ శోభ, డాక్టర్ తిరుపతిరావు జిల్లా మాస్ మీడియా అధికారి గారు శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

మహావీర్ వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

● మరణానంతరం డెడ్‌బాడీని అప్పగించాలని సూచించిన 75 ఏళ్ల మహిళ

● వైద్య విద్యార్థుల ప్రయోగార్థం నిర్ణయం

వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మరణాంతరం తన శరీరం వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం ఉపయోగపడాలన్న ఓ వృద్ధ మహిళ కోరికను ఆమె కుమారుడు నెరవేర్చాడు. హైదరాబాద్‌కు చెందిన భారతమ్మ(75) తాను మృతిచెందిన తర్వాత శరీరాన్ని వైద్య విద్యార్థులు తమ ప్రయోగాల కోసం ఉపయోగించుకునేందుకు వీలుగా ఓ వైద్య కళాశాలకు అప్పగించాలని కుమారుడిని కోరింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భారతమ్మ మృతదేహాన్ని ఆమె కోరిక మేరకు కుమారుడు కేపీ ముని సురేష్ పిళ్లై వైద్య కళాశాలకు అందజేసేందుకు ముందుకు వచ్చారు. హైదరాబాద్‌లోని అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వర లింగం ఆధ్వర్యంలో భారతమ్మ మృతదేహాన్ని బుధవారం వికారాబాద్‌లోని మహావీర్ వైద్య కళాశాలకు అందజేశారు. అంతకు ముందు ఇందుకు సంబంధించిన డాక్యుమెంటేషన్ ప్రక్రియను సురేష్ పిళ్లై పూర్తిచేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పరిపాలనా విభాగం ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బతికి ఉండగా రక్తదానం, బ్రెయిన్‌డెడ్‌తో అవయవ దానం, మరణం తర్వాత నేత్రదానం, శరీర దానం సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఆ దిశగా అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం కృషి చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.

నిండుకుండల్లా చెరువులు, కుంటలు



యాచారం : నిండుకుండలా తాటిపర్తిలోని గండికుంట

▸ వరద నీరు చేరడంతో అలుగు పారుతున్న తటాకాలు

యాచారం, సెప్టెంబరు 11 : ఇటీవల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురియడంతో అడవుల నుంచి వరద నీరు చెరువులు, కుంటల్లోకి వచ్చి చేరుతోంది. అడవుల్లో ఉన్న చెక్‌డ్యాంలు నిండి అలుగు పారుతుండడంతో వరద నీరు చెరువులు, కుంటల్లోకి వచ్చి చేరుతోందని సంబరపడుతున్నారు. మండల పరిధిలోని శంకరాయమల, తాటిపర్తి, కుర్మిద్ద అడవుల నుంచి భారీగా వరద నీరు రావడంతో చెరువులు, కుంటలు నిండుతున్నాయి. ఇప్పటికే తాటిపర్తిలోని గండికుంట, కుర్మిద్దలోని ధర్మపురి చెరువు, వెంకటయ్యకుంటలు రెండు రోజులుగా అలుగు పారుతున్నాయి. దాంతో నానక్‌నగర్, మేడిపల్లి, తక్కళ్లపల్లి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి చేరి అటు నుంచి నల్గొండ జిల్లా శివన్నగూడ, మర్రిగూడ మండలాలకు చేరుతోంది. కుర్మిద్దలోని వెంకటయ్యకుంట, ధర్మపురి చెరువు నిండడడంతో కందుకూరు మండలంలోని ఆకులమైలారం మైలమ్మ చెరువులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాల్లోని చెరువుల్లోకి 45శాతం వరద నీరు వచ్చి చేరింది. తాటిపర్తిలోని బందం చెరువు 40శాతం మేర నిండింది.



బొంరాస్‌పేట్ : నిండుకుండలా బొంరాస్‌పేట్ పెద్దచెరువు



యాచారం: బంధం చెరువు తూము వరకు చేరుకున్న నీరు

బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు జలకళ

బొంరాస్‌పేట్ : ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో బొంరాస్‌పేట్ పెద్ద చెరువు జలకళను సంతరించుకుంది. పెద్ద చెరువుకు వచ్చే ఏటి కాల్వ వారం రోజుల క్రితం తెగిపోవడంతో నీరంతా వాగులోకి చేరింది. చెరువు నిండుకుండలా మారి బుధవారం అలుగు పారింది. దాంతో ప్రజలు ఆయకట్టు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, పెద్దచెరువు కింద 800 ఎకరాల్లో ఆయకట్టు సాగయ్యే అవకాశాలున్నాయి.

ప్రకృతి సంపదను పెంపొందించాలి

▸ పర్యావరణ శాస్త్రవేత్త డా.ఉమామహేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 11: ప్రకృతి సంపదను పెంపొందించాలని, లేని యెడల మానవాళి మనుగడకు ప్రమాదమని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలో గల ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ రెండో విడత అవగాహన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డా.ఉమామహేశ్వర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ డీఎస్‌వో శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సదస్సులో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సాయి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నేల, వ్యవసాయం, ప్రకృతి మధ్యగల అవినాభావం, సంబంధాలపై విద్యార్థులకు తెలిపి వ్యవసాయ పరిజ్ఞానం పెంపొందించాలన్నారు. సీజీఆర్ సలహాదారు వెంకట్ రెడ్డి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐకార్ ఎంట్రెన్స్‌లో తలకొండపల్లి మండలవాసికి 14వ ర్యాంక్



తలకొండపల్లి, సెప్టెంబరు 11 : మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటకు చెందిన చప్పిడి శివ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐకార్) ఏఐఈఈఏలో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించాడు. వెంకట్రావ్‌పేటకు చెందిన చప్పిడి తిరుపతయ్య సుశీల దంపతుల కుమారుడు శివ ఏఐఈఈఏ-2024 ప్రవేశ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరిచి 14వ ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు బుధవారం ఫలితాలు వెలువడ్డాయి. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించి జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించిన శివను పలువురు అభినందించారు. గతంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ సెట్ ఫలితాల్లో శివ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించాడు.



వినోభాబావే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బక్కని నర్సింహులు, తదితరులు

‘భూదాన్’ భూములను పరిరక్షించండి

▸ వినోభాబావే జయంతిలో బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 11: భూస్వాముల నుంచి సేకరించి, పేదల జీవనోపాధి కోసం పంపిణీ చేసిన భూధానోద్యమ భూములను పరిరక్షించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పద్మశాలి భవనంలో బుధవారం వినోభాబావే 129వ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. బక్కని మాట్లాడుతూ మహారాష్ట్రలో పుట్టి దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వినోభాబావే ఆశయాన్ని రియల్టర్లు, స్వార్థ రాజకీయ నాయకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినోభాబావే దేశ వ్యాప్తంగా పాదయాత్ర చేసి దాదాపు 46 లక్షల ఎకరాల భూమిని సేకరించి, పేదలకు పంచారని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో కూడా పలువురు భూములను ఇచ్చారని తెలిపారు. నాడు రాష్ట్ర వ్యాప్తంగా కోటీ 70 లక్షల జనాభా ఉన్నప్పుడు భూమి కోసం సాయుధ పోరాటాలు జరిగాయని, నేడు 4 కోట్ల జనాభా ఉన్నా కూడా భూమి కొనుగోలుపై పరిమితిని విధించకపోతే ఎలా అని ప్రశ్నించారు. పట్టణ ప్రముఖులు పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి, సాయికృష్ణ, లింగారం కుమార్‌గౌడ్, వి. గంగిరెడ్డి, ఒగ్గు కిషోర్, పద్మశాలి సంఘం నాయకులు జనార్ధన్, చెన్న బాల్‌రాజ్, సత్యనారాయణ, బసా రాజేందర్, బాలాజీ, దాస రమేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసం.. ఆరోగ్య రక్షణే లక్ష్యం

▸ జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు

మేడ్చల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గర్భంలోని శిశువు ఎదుగుదల నుంచి శిశువు జన్మించే వరకు.. ఆ తరువాత పెరుగుతున్న పిల్లలకు తగిన పోషకాహారం అందిస్తే ఎంతో మేలు చేకూరుతుంది. ఆరోగ్య సమస్యలు తలెత్తవు.

ప్రభుత్వాల ప్రత్యేక దృష్టి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయి. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని కుటుంబాలు వీటిని అందిపుచ్చుకోవడం లేదు. కొందరు తల్లిదండ్రులు కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ పిల్లలకు పౌష్టికాహారం అందించలేకపోతున్నారు. రోజువారీ కూలీలుగా పనిచేసే కుటుంబాలు పోషణ విషయంలో తగిన శ్రద్ధ చూపడం లేదు. ఇటువంటి కుటుంబాలకు పోషణ మాసోత్సవాల్లో పోషకాహారం అందించనున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పోషకాహార లోపంతో ఉన్న గర్భిణీలు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారం అందిస్తారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, బాలామృతం ప్లస్ అందజేస్తున్నారు. గుర్తించిన వారికి తగిన వైద్యం అందేలా చూడటంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు కౌన్సిలింగ్ ఇప్పిస్తారు. రక్తహీనత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతారు.

పోషకాహార లోపం ఉన్నవారు..

జిల్లాలో 34,267 మంది పోషకాహారం లోపం లేకుండా సాధారణంగా ఉన్నారు. అతి తీవ్ర లోపంతో 7,139 మంది, మధ్యస్థ లోపంతో 17,531 మంది పోషకాహారం లోపంతో ఉన్నట్లు గుర్తించారు.



పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా మహిళా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి (ఫైల్)

పండగ వాతావరణంలో కార్యక్రమాలు

పోషణ మాసోత్సవం సెప్టెంబరు 1న ప్రారంభమైంది. విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో గ్రామీణ స్థాయిలో రోజూ ఒక కార్యక్రమాన్ని ఎంపిక చేసుకుని ఈ నెల 30 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పిల్లలకు ఆట పాటలు, మాతృపోషణ, తక్కువ బరువు, ఎత్తు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లడం, కిశోర బాలికలకు తగిన సూచనలు, ఆరోగ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, తదితరాలను పండుగ వాతావరణంలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయిస్తున్నారు. ప్రజలు భాగస్వామ్యంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు.

జిల్లావ్యాప్తంగా బాధితుల నివేదిక

జిల్లావ్యాప్తంగా మొత్తం 1,13,471 మంది పిల్లలను పరిశీలించారు. వీరిలో 34,267 మంది సాధారణ బరువు కలిగి ఉన్నారు. అతి తక్కువ బరువు ఉన్న పిల్లలు 7,139 మంది ఉండగా మధ్యస్థ బరువు ఉన్నవారు 17,531 మందిని గుర్తించారు.

ఏటా రెండుసార్లు పోషణ్ పక్వాడా

మార్చి నెలలో పోషణ్ పక్వాడా పేరుతో 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాం. సెప్టెంబరు మాసంలో పోషణ మాసోత్సవం పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం. మాసోత్సవాన్ని జిల్లా అంతటా విస్తృతంగా నిర్వహిస్తాం.

- కృష్ణారెడ్డి, మహిళా శిశు సంక్షేమ అధికారి

‘టాస్క్’ సీఈవోగా రాఘవేందర్‌రెడ్డి?

త్వరలో నియామక ఉత్తర్వులు



ఆమనగల్లు, సెప్టెంబరు 11 : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చౌదర్‌పల్లికి చెందిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేరు ఖరారైందని విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒకటి రెండు రోజుల్లో ఆయనకు నియామక ఉత్తర్వులు అందనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో కొనసాగే అకాడమీకి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వృత్తి నైపుణ్యం ఉన్న యువతను గుర్తించి వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి, రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల స్థాయిలో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్కిల్ నాలెడ్జ్ అకాడమీకి కొత్తగా సీఈవో పోస్టును ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ పోస్టుకు ఇప్పటికే సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేరు ఖరారైనట్లు సమాచారం. అకాడమీ సీఈవో నుంచి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా ముచ్చర్ల ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో గత రెండేళ్లుగా కల్వకుర్తి నియోజకవర్గంలో యువత, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేరును సీఈవోగా ఎంపిక చేసినట్లు ప్రాథమిక సమాచారం.

బూట్ క్యాంప్‌లతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగు

▸ ఢిల్లీ ఫైనాన్స్ బ్యూరో డైరెక్టర్ గుజ్జు మనుశ్రీ



బూట్ క్యాంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మనుశ్రీ

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11: విద్యార్థుల ఆలోచనలకు పదును పెడుతూ.. నూతన ఆవిష్కరణలు చేపట్టేలా వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు బూట్ క్యాంపులు ఎంతగానో దోహద పడతాయని ఢిల్లీ ఫైనాన్స్ బ్యూరో డైరెక్టర్ గుజ్జు మనుశ్రీ, ఏఐసీటీఈ ఇన్నోవేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ భీమారెడ్డి తెలిపారు. బుధవారం శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహిస్తున్న బూట్ క్యాంపును పాఠశాల విద్యాశాఖ ఏపీఎస్డీ రాజీవ్, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర ప్లానింగ్ అండ్ యంఐఎస్ కో-ఆర్డినేటర్ సంపత్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మనుశ్రీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల ప్రోత్సాహకాలను విద్యార్థులకు చేరేలా బూట్ క్యాంపు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్స్ తరహాలో ఐడియా ల్యాబ్స్‌ను నెలకొల్పేందుకు అందిస్తున్న సహకారంపై పి.రాజీవ్ తెలిపారు. బూట్ క్యాంపులో విద్యార్థులు నేర్చుకున్న విషయాలను పాఠశాలకు వెళ్లిన తర్వాత ఇతర విద్యార్థులతో చర్చించాలని సూచించారు. వెంకట నర్సమ్మ మాట్లాడుతూ సాంప్రదాయ విద్యను డిజిటల్ విద్యగా మార్చే క్రమంలో పీఎం శ్రీ స్కూల్స్ ఎంతో మెరుగ్గా పని చేస్తున్నాయని తెలిపారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ ఎలంగోవన్ కరియప్పన్, హైదరాబాద్ ఇన్నోవేషన్ సెంటర్ మేనేజర్ భీమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన విధానాన్ని పెంపొందించేలా నూతన ఆవిష్కరణలు చేపట్టేలా ఏఐసీటీఈ ఆధ్వర్యంలో 29 జూలై 2025లో నిర్వహించే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో పాల్గొనాలని తెలిపారు. వారి ఆవిష్కరణలు సృజనాత్మకత కలిగి ఉంటే రూ.1.5 లక్షల ప్రోత్సాహక నగదు అందివ్వనున్నట్లు చెప్పారు. నోడల్ సెంటర్ ఎస్‌పీడీసీ డాక్టర్ జె.కృష్ణచైతన్య, నోడల్ సెంటర్ కో-ఆర్డినేటర్‌లు డాక్టర్ ఎస్.రాజేందర్, జె.సాయి, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలి

కులకచర్ల, సెప్టెంబరు 11: రుణమాఫీ కాని రైతులు కులకచర్ల రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో వీరస్వామి తెలిపారు. కులకచర్లలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో పర్యటించి రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఉమ్మడి మండల పరిధిలో రుణమాఫీ కాలేదని 428 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, గ్రామాల్లో పర్యటించి ఇప్పటి వరకు 302 మంది రైతుల వివరాలు సేకరించినట్లు తెలిపారు.



నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, ఏబీవీపీ నాయకులు

స్కూల్లో ర్యాగింగ్, డ్రగ్స్‌ను అరికట్టాలి

▸ డీఆర్‌ఎస్ పాఠశాల ఎదుట

విద్యార్థుల తల్లిదండ్రులు, ఏబీవీపీ నాయకుల నిరసన

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11 : ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంలో పాఠశాల యాజమాన్యం విఫలమయ్యిందంటూ బుధవారం ఏబీవీపీ నాయకులతో కలిసి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని డీఆర్‌ఎస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాలలో ర్యాగింగ్ సంస్కృతిని పాఠశాల యాజమాన్యం పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతో విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. పాఠశాల నియంత్రణ కోల్పోయిన యాజమాన్యంపై, విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోని ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్కూల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఏబీవీపీ నాయకులను అరెస్టు చేశారు. అయితే, నిరసనపై యాజమాన్యం నోరు మెదపకపోవటం గమనార్హం.



డ్రోన్‌తో పంటలపై మందులు స్ప్రే చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

అధునాతన యంత్రాలతో సేద్యంపై దృష్టి సారించాలి

▸ కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త వీకే సింగ్

యాచారం, సెప్టెంబరు 11 : అత్యంత అధునాతన యంత్రాలతో సాగు చేయడంపై ప్రధానంగా రైతులు దృష్టి సారించాలని, ముఖ్యంగా యంత్రాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిస్తున్నాయని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వీకేసింగ్ వెల్లడించారు. బుధవారం యాచారం మండలం గడ్డమల్లాయగూడలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డ్రోన్‌తో రసాయన మందులు స్ప్రే చేయడం, కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ పొలంలో తక్కువ పెట్టుబడులతో పంటలు సాగు చేయడం చాలా మంచిదన్నారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వాడాలన్నారు. క్రిమి కీటకాలను తట్టుకొని మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలు నాటుకోవాలని చెప్పారు. ముఖ్యంగా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా రైతులు చొరవ తీసుకోవాలన్నారు. కరువును తట్టుకొని మంచి దిగుబడినిచ్చే విత్తనాలు వాడితే రైతులకు మంచి లాభాలు వస్తాయని వెల్లడించారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, డాక్టర్ గిరిజావేణి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళ డ్రోన్ల కలకలం

▸ భయాందోళనలో గ్రామస్తులు.. పోలీసులకు ఫిర్యాదు

యాచారం, సెప్టెంబరు 11 : మండలంలోని చింతపట్ల, మొండిగౌరెల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి 12 గంటల వరకు ఆకాశంలో డ్రోన్లు ఎగరడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు రెండు అధునాతన డ్రోన్లు ఎగరేయడంతో జనం భయంతో వణికిపోయారు. కాగా, వాటిని చూసిన గ్రామస్తులు.. ఎవరైనా బాంబులు వేసేందుకు పథకం వేశారా? లేక ఆయా గ్రామాల పరిసరాల్లో ఉన్న పశువులు, మేకలు, గొర్రెలు అపహరించేందుకు ఆరా తీశారా? అని భయపడ్డారు. సమాచారం అందుకున్న యాచారం పోలీసులు రెండు గ్రామాలకు వచ్చివెళ్లే రహదారుల్లో నిఘా పెట్టి డ్రోన్‌లు ఎగరేసిన వారిని పట్టుకునేందుకు యత్నించారు. ఫలితం లేకపోవడంతో విచారణ వేగవంతం చేసినట్లు సీఐ శంకర్ కుమార్ తెలిపారు. ఈ విషయంలో గ్రామస్తులు ఆందోళన చెందవద్దని ప్రజలకు సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఆశారాం బాపు సేవా సమితి సభ్యులు

యోగా, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన

కొడంగల్, సెప్టెంబరు 11: శ్రీ ఆశారాం బాపు సేవా సమితి శంషాబాద్ వారి ఆధ్వర్యంలో బుధవారం కొడంగల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగా, ధ్యానం, ప్రాణాయామంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మానవ జీవితంలో యోగా, ధ్యానం, ప్రాణాయామం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు వీటిని ఆచరించడంతో జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు వెంకటేశ్, ఆనంద్‌రావు, ఏసురత్నం, గోపీనాథ్, అజీజ్ పాల్గొన్నారు.

హరీశ్వర్‌రెడ్డి అందరివాడు

▸ పరిగి మాజీ ఎమ్మెల్యే వర్ధంతి సభలో

మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరీష్‌రావు, సబితారెడ్డి, మధుసూధనాచారి, మాజీ ఎమ్మెల్యేలు

పరిగి, సెప్టెంబరు 11: రాజకీయ దురంధరుడు, సీనియర్ నేత దివంగత కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి రాజకీయాల్లో అందరివాడిగా పేరుప్రతిష్ఠలు తెచ్చుకున్నారని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కొనియాడారు. ఉమ్మడి ఏపీ మాజీ ఉపసభాపతి, పరిగి మాజీ ఎమ్మెల్యే దివంగత హరీశ్వర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని బుధవారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొని హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కర్మ క్రియలను హరీశ్వర్‌రెడ్డి తనయుడు మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితుడు సిద్ధాంతి పార్థసారథి నిర్వహించారు. నియోజకవర్గం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూధనాచారిలు మాట్లాడుతూ రాజకీయ దురంధరుడు, సీనియర్ నేత కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి రాజకీయాల్లో అందరివాడిగా పేరుప్రతిష్ఠలు తెచ్చుకున్నారని కొనియాడారు. ఏనాడు రాజకీయాల్లో ‘కోపం’ అనే పదమే తెలియని నేతగా ముద్ర వేసుకున్నారన్నారు. ఎప్పుడూ ఆయన ముఖంలో చిరునవ్వే.. కష్టాలొచ్చినా, కన్నీళ్లొచ్చినా నేనున్నానని వెన్నుతట్టి నిలబడే నాయకుడిగా పేరుప్రతిష్ఠలు ఆయనకే చెల్లుతాయని కొనియాడారు. కార్యక్రమానికి చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మునిసిపల్ చైర్మన్ అశోక్, నాయకులు కార్తీక్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సురేందర్, బి.ప్రవీణ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరం : ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 : నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయమైన ప్రజా భవన్‌లో యాచారం మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.2.38లక్షల విలువచేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని ఆయన అన్నారు.


లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇళ్లు కూలిన పేదలకు నూతన గృహాలు


ఇళ్లు కూలిన వారికి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 11 : భారీ వర్షాలతో ఇళ్లు కూలిన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టి స్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఇళ్లు కూలిన బాధితులకు తహసీల్దార్ కా ర్యాలయంలో బుధవారం చెక్కుల పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.3,200 చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు కూలిన వారితో పాటు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. ప్రభుత్వం మొదటివిడత నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించిందని, అయితే కల్వకుర్తికి 10వేల ఇళ్లు మంజూరుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరానని నారాయణరెడ్డి తెలిపారు. అధికారులు దెబ్బతిన్న పంటలు, చెరువులు, రోడ్ల నివేదికలను ప్రభుత్వానికి ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మణ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, డీటీ వినోద్, ఆర్‌ఐ చెన్నకేశవులు, నాయకులు తల్లోజు రామకృష్ణ, శివలింగం, వస్పుల మానయ్య, బాబా, విజయ్‌నాయక్, వగ్గు మహేశ్, ఎంగళి ప్రసాద్, కృష్ణనాయక్, పర్వతాలు, ఖలీల్, వస్పుల శ్రీకాంత్ , కృష్ణయ్య, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీను నాయక్, మహేశ్, రజాక్, రాము, ఎంగలి ప్రసాద్ పాల్గొన్నారు.

మేడిగడ్డ వంతెన పరిశీలన

మేడిగడ్డ-శంకర్‌కొండ రోడ్డులో నిలిచిన వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి పరిశీలించారు. పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేసేలా కాంట్రాక్టర్‌కు నోటీసులివ్వాలని అధికారులను ఆదేశించారు. కత్వవాగు రోడ్డును మరమ్మతు చేయాలని ఏఈ అభిషేక్‌కు సూచించారు. నాయకులు విజయ్‌రాథోడ్, మల్లేశ్‌నాయక్ ఉన్నారు.

క్రైం కార్నర్

నాలుగిళ్లలో చోరీ.. స్థానికుల భయాందోళన

తలకొండపల్లి, సెప్టెంబరు 11: తలకొండపల్లిలో దొంగలు ఒకే రోజు నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఆవంచ చెన్నకేశవరెడ్డి, దోమ రాంరెడ్డి, సురేశ్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డిల ఇళ్లలో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. బీరువాలు ధ్వంసం చేసి రూ.6.63లక్షలు, 6.5తులాల బంగారు నగలు అపహరించుకుపోయారు. దొంగతనాలు జరిగిన ఇళ్లను సీఐ ప్రమోద్‌కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు. సందీప్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అర్ధరాత్రి దొంగ హల్‌చల్

చేవెళ్ల, సెప్టెంబర్ 11 : చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం అర్ధరాత్రి ఓ దొంగ హల్‌చల్ చేశాడు. మద్యం తాగొచ్చి బ్లేడ్‌తో గొంతు కోసుకొని, సిబ్బందిపై దాడికి యత్నించాడు. చేవెళ్లకు చెందిన కె.కృష్ణ చోరీలకు పాల్పడి జైలుకెళ్లి వచ్చాడు. మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి కోర్టు ఆవరణలోకి వెళ్లాడు. పోలీసులు చేరుకొని బయటకు పంపారు. అక్కడి నుంచి ఆస్పత్రికి వెళ్లి సిబ్బందితో గొడవపెట్టుకొని బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. సిబ్బంది సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని బయటకు తీసుకెళ్లారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఆమనగల్లు, సెప్టెంబరు 11: ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. తలకొండపల్లిలోని తుమ్మలకుంట తండా వద్ద పెద్దూరు తండాకు చెందిన రెడ్యానాయక్ తన ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు చేరుకొని డ్రైవర్ ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన దేవేందర్ తన టిప్పర్‌లో కల్వకుర్తి, హైదరాబాద్‌లకు మట్టి తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరు గొప్ప నిర్ణయం


షాద్‌నగర్‌లో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రజక సంఘం నాయకులు


మాట్లాడుతున్న గడ్డం చంద్రయ్య

షాద్‌నగర్ అర్బన్/షాబాద్, సెప్టెంబరు 1: నగరంలోని కోటి ఉమెన్స్ కళాశాలకు చాకలి ఐలమ్మ కళాశాలగా ప్రభుత్వం పేరు పెట్టడం గొప్ప చరిత్రాత్మక నిర్ణయం అని షాద్‌నగర్ రజక సంఘం నాయకులు అన్నారు. భూమి, భుక్తి కోసం సాయుధ పోరాటం చేసిన చాకలి ఐలమ్మ వర్ధంతి రోజున కళాశాలకు ఆమె పేరును పెడతామని సీఎం ప్రకటించడంతో రజక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం షాద్‌నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమే రజకులను గౌరవిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.పెంటయ్య, రాంచందర్, అశోక్, శేఖర్, అనంతం, మల్లేష్, ఆంజనేయులు, రామస్వామి, పురుషోత్తం పాల్గొన్నారు. తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ పేరును కోటి ఉమెన్స్ కాలేజీకి పెట్టడం చరిత్రాత్మకం అని రంగారెడ్డి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య అన్నారు. షాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రజకులకు గుర్తింపునిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రజకులకు సమాజంలో గొప్ప గుర్తింపును ఇచ్చే విధంగా ఐలమ్మ పేరును కోటి ఉమెన్స్ కాలేజీకి పెట్టడం గొప్ప నిర్ణయం అన్నారు.

కేసీఆర్ కృషి ఫలితంగా మెడికల్ కాలేజీకి అనుమతులు


కందుకూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సబితారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 11 : మాజీ సీఎం కేసీఆర్ కృషి ఫలితంగానే కందుకూరులో మెడికల్ కాలేజీకి కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని, ప్రజల కోసం పనిచేసే నాయకులకే గుర్తింపు ఉంటుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వమే మీర్ఖాన్‌పేటలో మెడికల్ కాలేజీని నిధులు మం జూరు చేసిందని చెప్పారు. ఇప్పుడు దానికి కేంద్ర అనుతివ్వడం హర్షనీయం అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు కింద ప్రతీ ఎస్సీ పేద కుటుంబానికి రూ.10లక్షలు మంజూరు చేసిందని, అప్పట్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే రూ.12లక్షలిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరిస్తున్నారని సబిత ఆరోపించారు. దళితబంధు కింద గత ప్రభుత్వం కందుకూరు మండలంలో 350 మందికి నిధులిచ్చామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 71 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ కూడా తక్కువే ఇస్తోందన్నారు.కార్యక్రమంలో ప్యాక్స్‌చైర్మన్ డి.చంద్రశేఖర్, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జయేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మీర్జాగూడ పంచాయతీని స్వాధీనం చేసుకున్న మున్సిపల్ అధికారులు


పురపాలక సంఘ కార్యాలయం, నార్సింగి అని మార్చిన మీర్జాగూడ పంచాయతీ పేరు

చేవెళ్ల, సెప్టెంబర్ 11: శంకర్‌పల్లి మండలం మీర్జాగూడ పంచాయతీని నార్సింగి మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అధికారులు, సిబ్బందితో కలిసి మీర్జాగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఆయా రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఇకపై మీర్జగూడ గ్రామ పంచాయతీ కాదని, నార్సింగ్ మున్సిపాలిటీలో విలీన గ్రామమైందన్నారు. మున్సిపాలిటీలోని ఒక వార్డుగా అవతరించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మీర్జాగూడ పంచాయతీ కార్యాలయ బోర్డును సైతం మార్చారు. పురపాలక సంఘ కార్యాలయం, నార్సింగి అని పేయింట్‌తో రాయించారు. ఇక నుంచి నార్సింగి మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తారని కమిషనర్ స్పష్టం చేశారు.

వీర్లపల్లి శంకర్‌కు ఘన సన్మానం



షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 11: షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శంకర్‌ను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. పనిచేసే వారిని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం గుర్తిస్తుందని ప్రతీ కార్యకర్త తెలుసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తూ, ప్రభుత్వ పథకాల అమలుకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పలోమా విల్లాలను నాలాపై నిర్మించారని ఫిర్యాదు

చేవెళ్ల, సెప్టెంబరు 11: మండల పరిధి మోకిలలో ఈఐపీఎల్, లా పలోమా కమ్యూనిటీలో నిర్మించిన విల్లాలు నాలాను మళ్లించి నిర్మించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్ జిల్లా కలెక్టర్ శశాంకను కోరారు. బుధవారం శంకర్‌పల్లి, మోకిలకు చెందిన కాంగ్రెస్ నాయకులు సత్యం, వాజిద్, అహ్మద్, షబ్బీర్, యాసిన్, ఖాజాపాషా, నజీర్, వెంకటేశ్, శేఖర్ తదితరులు కలెక్టర్‌కు వినతి ప్రతం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాలా సహజ ప్రవాహన్ని దారి మళ్లించి దానిపై బిల్డర్ విల్లాలను నిర్మించారని చెప్పారు. గ్రామ పురాతన నక్షలో నాలా స్పష్టంగా ఉందన్నారు. నాలా అసలు మార్గాన్ని మళ్లించి పొలాలు, ఇళ్లు మునిగేలా చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేసి నాలా సహజ ప్రవాహన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరామని వివరించారు.

సీఐని కలిసిన డీఎస్పీ నాయకులు

మాడ్గుల, సెప్టెంబరు 11 : మాడ్గుల నూతన సీఐ జగదీష్‌ను బుధవారం పోలీస్ స్టేషన్‌లో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ జిల్లా కన్వీనర్, కల్వకుర్తి ఇన్‌చార్జి వంకేశ్వరం రమేష్, మండల నాయకులు కట్ట చిత్తరంజన్‌లు సీఐని శాలువా, పూలమాలతో సన్మానించారు. ధర్మ సమాజ్ పార్టీ లక్ష్యాల గురించి ఈ సందర్భంగా సీఐకి వివరించారు. కార్యక్రమంలో నాయకులు హరి, భాస్కర్, మల్లేష్, బలరాం, మహేష్ పాల్గొన్నారు.

హరీశ్‌రావుకు చేవెళ్ల నాయకుల సన్మానం


మాజీ మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల, సెప్టెంబరు 11: బీఆర్‌ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు చేవెళ్లలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బుధవారం హైదరాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా పరిగికి వెళ్తున్న హరీశ్‌రావు చేవెళ్లలో ఆగడంతో బీఆర్‌ఎస్ నాయకులు తరలివచ్చి మాజీ మంత్రిని శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర యువ నాయకులు పి.కార్తీక్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, నాయకులు డి.ఆంజనేయులు, మాణిక్యరెడ్డి, బి.నర్సింలు, వైకృష్ణ, చందు, శంకరయ్య, మహేందర్, జనార్దన్‌రెడ్డి, కందడ మల్లేష్, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 11 : ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని ఎంఈవో సర్దార్‌నాయక్ అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలుర, బాలికల, కేజీబీవీ, పోలెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను బుధవారం ఎంఈవో సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలడిగి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరును పరిశీలించారు. టీచర్లతో సమావేశమై సూచనలు చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో పద్మజ్యోతి, ప్రధానోపాధ్యాయులు పాండు, రామలక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఎంపీ రవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు ఎం.రాములు, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 11: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిని బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ జిల్లా నాయకులు మండ్లీ రాములు, రవీందర్ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందేలా చూడాలని కోరారు. వర్షాలకు దెబ్బతిన్న చెరువుకుంటలు, రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని కోరగా ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు ఉన్నారు.

పూజలందుకుంటున్న గణనాథులు


కొందుర్గులోని ఉమామహేశ్వర ఆలయం వద్ద వినాయకుడి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


యాచారం: మాల్‌లో గణనాథుడికి పూజలు


షాబాద్: మద్దూర్‌లో పూజలు చేస్తున్న వాసుదేవ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సునీతప్రసాద్ తదితరులు


కడ్తాలలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, స్థానికులు


మైసిగండిలో గణేశుడికి పూజలు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, దశరథ్, జవహర్‌లాల్ తదితరులు

పట్టణాభివృద్ధికి నిధులివ్వండి

షాద్‌నగర్, సెప్టెంబరు 11: షాద్‌నగర్ పట్టణాభివృద్ధికి, వర్షాలకు దెబ్బతిన్న పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం, చెరువులు, కుంటల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందు ప్రతిపాదనలు పెట్టారు. భారీ వర్షాలకు వరదలు రావడంతో పంట నష్టం జరిగింది. నియోజకవర్గంలో 678ఎకరాల్లో పంట నష్టం జరిగి 830మంది రైతులు నష్టపోయారు. పంటలు నష్ట పోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని సీఎంను కోరారు. నియోజకవర్గంలో తానూ పర్యటించి పంటలను పరిశీలిస్తానని ఎమ్మెల్యేకు సీఎం వివరించినట్లు సమాచారం. నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధి, మరమ్మతులకు రూ.47.98కోట్లు కేటాయించాలంటూ కోరారు. ఈ మేరకు నివేదికలను సీఎంకు అందజేశారు. కొత్తూరు మండలం రెండు చెరవులకు, నందిగామ మండలం అప్పారెడ్డిగూడ, నర్సప్పగూడ చెరువులకు, చౌదరిగూడలో రెండు చెరవులకు, కొందుర్గు మండల ఒక చెరువు, కేశంపేటలో 8 చెరువులకు నిధులివ్వాలని కోరారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 11: గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ శివారు బొబ్బిలి చెరువును బుధవారం అధికారులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గజ ఈతగాళ్లను, బోటును అందుబాటులో ఉంచాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయనతో ఏసీపీ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమనగల్లు/కడ్తాల్: సెప్టెంబరు 11: పౌష్టికాహారం సంపూర్ణ ఆరోగ్యానికి ఉపకరిస్తుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ అన్నారు. ఆకుకూరలు, పప్పు దినుసులు రోజూ ఎక్కువగా తీసుకోవాలని సూ చించారు. సీతారాంనగర్ తండాలో బుధవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. సీడీపీవో, ఎంపీడీవో కుసుమమాధురి హాజరయ్యారు. పోషక విలువల గురించి అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌రాధిక, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, గర్భిణులు పాల్గొన్నారు. అలాగే కడ్తాల్ మండలం గడ్డమీది తండాలో పౌష్టికాహార వారోత్సవాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ శబరి హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్ కళావతి, ఆయా గీత పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కేశంపేట, సెప్టెంబరు 11: విద్యార్థులు క్రీడలలో రాణించాలని ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, క్రీడలు ప్రారంభించారు. 10 పాఠశాలల నుంచి 400 విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే తక్కువ సమయంలో ఎక్కువ గుర్తింపు వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడలలో తమ సత్తాచాటాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, జీహెచ్‌ఎం విద్యావతి, నోడల్ అధికారి చంద్రశేఖర్, ఆనంద్‌బాబు, కృష్ణారెడ్డి, భాగ్యలక్ష్మి, గౌరి, రామకృష్ణ పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ ఫలాలు


రైతుల వివరాలు స్వీకరిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఆదిభట్ల, సెప్టెంబరు 10: ప్రతీ రైతు కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేస్తామని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఇబ్రహీంపట్నం ఏవో విద్యాధరి, ఏఈఓ శ్రవన్‌కుమార్, ప్రత్యేకాధికారి చాణిక్యులతో కలిసి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అలాగే అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కొంగరకలాన్, ఆదిభట్ల గ్రామాలకు చెందిన 118మంది రైతులకు గాను బుధవారం 100మంది వివరాలను యాప్‌లో పొందుపర్చారు. సాంకేతిక కారణాల వల్లే కొందరికి రుణమాఫీ కాలేదని, దీన్ని ప్రభుత్వం పరిష్కరిస్తోందని అన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మొద్దన్నారు. రుణమాఫీ కానివారికి త్వరలోనే ఖాతాల్లో డబ్బు జమ చేస్తారని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11: విద్యార్థులు, యువత ఆలోచనలు తమ కెరీర్, సమాజం అభివృద్ధివైపు ఉండాలని, డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎస్సై నాగరాజు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందన్నారు. యువత వ్యసనాలకు లోనైతే వారి జీవితాలే నాశనమవుతాయన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. ఒక్కసారి మాదక ద్రవ్యాల కేసులో ఇరుక్కుంటే వారికి ఎక్కడా ఉద్యోగం రాదని, కేసులు, కోర్టుల చుట్టూ తిరిగి సమాజానికి దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. వీటితో ప్రాణాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత పిల్లలదేనన్నారు. కార్యక్రమంలో బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మెర్సీ వర్ధిని, సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, నాయకులు ప్రణయ్, శంకర్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● **కడ్తాల్:** బాధిత కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల మండల కేంద్ర వార్డుల్లో బుధవారం ఆయన పర్యటించి ప్రజల తెలుసుకొని పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో మృతిచెందిన రాజయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, నర్సింహ, వెంకటేశ్, యాదగిరి పాల్గొన్నారు.

● **కేశంపేట:** వర్షాలకు మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీఐటీయూ నాయకులు తహసీల్దార్ మీర్ ఆజం అలీకి వినతి పత్రం ఇచ్చారు. కేశంపేట-షాద్‌నగర్, కేశంపేట-తొమ్మిదిరేకుల, కేశంపేట-ఆమన్‌గల్, కేశంపేట-కొత్తపేట రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బేరి శ్రీనివాస్, శ్రీనునాయక్, మశ్చేందర్, మహేష్, అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి:** వెంకటాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. కామినేని ఆసుపత్రి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ రమేశ్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ అఖిల్, నిఖిల్, వైద్య సిబ్బంది 252 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సునీతసుదర్శన్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నిరంజన్, అంజిరెడ్డి, ఆశన్న, శ్రీనునాయక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● **ఆమనగల్లు:** పట్టణంలోని జగదాంబ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వహించిన భగద్గీత ధ్యానజ్ఞాన సంబరాలు ముగిశాయి. డాక్టర్ కసిరెడ్డి స్నేహలతరెడ్డి, డాక్టర్ సింధులతారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విద్యార్థులు తరలివచ్చారు. ఏడాదిగా ఈ ధ్యాన కేంద్రం ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో భగద్గీత బోధనలపై వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కేంద్రం నిర్వాహకురాలు కసిరెడ్డి జ్యోతిరెడ్డి, ఆమనగల్లు సూర్యలక్ష్మి కాటన్ మిల్ జీఎం సాయిబాబ హాజరై బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. భగద్గీత శ్లోకాలను కంఠస్థం చేయాలని వారు సూచించారు.

● **తలకొండపల్లి:** పడకల్ అప్పన్న చెరువు నుంచి లింగరావుపల్లి వరకు పాడైన రోడ్డును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి సొంత డబ్బుతో మరమ్మతు చేయించారు. ఈ రోడ్డు ఇటీవలి వర్షాలకు పూర్తిగా గోతులమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ప్రభాకర్‌రెడ్డి గోతుల్లో మట్టిపోయించి జేసీబీతో చదును చేయించారు. నాయకులు శివలింగం, ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

● **యాచారం:** యాచారం ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ముగిశాయి. కబడ్డీ అండర్-17 బాలుర విభాగంలో పుడమి పాఠశాల, బాలికల్లో యాచారం పాఠశాల నిలిచాయి. ఖోఖో బాలురలో చింతపట్ల, బాలికల్లో మేడిపల్లి స్కూల్, వాలీబాల్‌లో గున్‌గల్ బాలురు, మేడిపల్లి బాలికలు, కబడ్డీ అండర్-14 విభాగంలో చింతపట్ల బాలురు, యాచారం పుడమి బాలికలు, ఖోఖోలో యాచారం బాలురు నిలిచారు. వాలీబాల్‌లో మేడిపల్లి బాలురు, బాలికలు గెలిచారు. బీఎస్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శేఖర్‌రెడ్డి బహుమతులందించారు.

ఘనంగా జగన్నాథస్వామి ఆరాధనోత్సవం


ఆరాధనోత్సవంలో పాల్గొన్న శ్రీనివాస్‌యాదవ్, వివిధ పీఠాధిపతులు

తలకొండపల్లి, సెప్టెంబరు 11: మాదాయిపల్లిలోని సద్గురు యోగి బాలీశ్వరి మాత ఆశ్రమంలో బుధవారం జగన్నాథస్వామి 12వ ఆరాధనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామీజీలు, భక్తులు తరలివచ్చారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మహేశ్వర దత్తాత్రేయ ఆశ్రమ పీఠాధిపతి శంకరానందగిరిస్వామి, సిద్ధార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అన్నపూర్ణదివ్య, షాద్‌నగర్ మలయాళ ఆశ్రమ పీఠాధిపతి దయానందగిరిస్వామి, పలు ఆశ్రమాలు, పీఠాల నిర్వాహకులు హాజరయ్యారు. జగన్నాథస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి శంకరయ్యగౌడ్, కార్యవర్గ సభ్యులు, భక్తులు, స్వాములు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

పెద్ద గోల్కొండ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయండి


డీపీవోకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11: శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద గోల్కొండ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయాలని గ్రామస్థులు కోరారు. బుధవారం జిల్లా పంచాయతీ అధికారికి ఈ మేరకు వారు వినతి పత్రమందజేశారు. గ్రామంలో చాలా వరకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత కూలీలే ఉన్నారని, అన్ని విధాలా గ్రామం వెనకబాటుకు గురైందన్నారు. గ్రామాన్ని శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తే ఎంతో కొంత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

మల్కాపూర్ గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో కలపొద్దు


సీహెచ్. వెంకటేశ్

చేవెళ్ల, సెప్టెంబరు 11: జీవో 111 పరిధిలో గల మల్కాపూర్ గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీలో విలీరం చేయొద్దని ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీహెచ్. వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు కానున్న చేవెళ్ల మున్సిపాలిటీ నుంచి మల్కాపూర్‌ను మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. చేవెళ్లను మున్సిపాలిటీ చేయడం హర్షించదగ్గ విషయమే గానీ మల్కాపూర్‌ను మాత్రం స్వతంత్ర్య పంచాయతీగానే ఉంచాలని కోరారు. గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపితే అభివృద్ధి జరగదన్నారు. తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపొద్దని ఉన్నతాధికారుల ను, ప్రజాప్రతినిధులను గ్రామస్థుల తరుపున కోరుతున్నట్లు చెప్పారు.